సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 14 । మార్చి । 2025




వర్గీకరణ చేపట్టే వరకు..

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే దాకా పోరాటం కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణ అన్నారు. 10లో▸



ప్రభుత్వ చొరవతోనే అభివృద్ధి

మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల అన్నారు. 10లో▸



న్యూస్‌రీల్

పీఎంశ్రీ పథకాన్ని రద్దు చేయాలి



సీడీపీఓ షబానా బేగంకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బీస సాయి బాబ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు గురువారం సీఐటీయూ నాయకులతో కలిసి సీడీపీఓ షబానా బేగంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయిబాబ మాట్లాడుతూ.. విద్యారంగంలో మార్పుల పేరుతో కేంద్రం తెచ్చిన పీఎంశ్రీ పథకంతో ఐసీడీఎస్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అవుతుందని అన్నారు. మొబైల్ అంగన్‌వాడీ సేవల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోందని, దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, హెల్పర్లు అందించే సేవలు దూరం అవుతాయని తెలిపారు. పిల్లలు, పేదలకు నష్టం కలగించేలా ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారం చేపట్టి పదిహేను నెలలు అవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇందుకు నిరసనగా ఈనెల 17, 18 తేదీల్లో కలెక్టర్ కార్యాలయం ఎదుట వంటా వార్పు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్, అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు జయమ్మ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు సహించేది లేదు



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీలత

షాబాద్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనులు సక్రమంగా జరిగేలా చూడాలని డీఆర్‌డీఓ శ్రీలత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉపాధిహామీ భవనంలో 2023–2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు ఉపయోగపడే పనులను ఎంపిక చేసుకోవాలన్నారు. మొక్కలు నాటడం, వాటి సంరక్షణ, వ్యవసాయ పొలాల్లో కాలువలు తవ్వడం, పొలాలను చదును చేయడం, గట్లు పోయడం వంటి పనులు చేపట్టాలని సూచించారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అపర్ణ, ఏపీడీ చరణ్‌గౌతమ్, ఏఈవో కొండయ్య, అంబుడ్స్‌మెన్ సునీతామూర్తి, క్యూసీ సునీత, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ వీరాసింగ్, ఎస్ఆర్‌పీ రంజిత్, డీఆర్‌పీలు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిసెంట్లు పాల్గొన్నారు.

గ్రూప్-2లో ప్రతిభ



రాకేష్

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రూప్–2 ఫలితాల్లో మండలంలోని పోల్కంపల్లి గ్రామానికి చెందిన రాకేష్ సత్తా చాటాడు. రాష్ట్రంలో 177వ ర్యాంకు సాధించాడు. మల్టీజోన్‌లో 78వ ర్యాంకు, ఆరో జోన్‌లో 33వ ర్యాంకు సొంతం చేసుకున్నాడు. రాకేష్ ఇప్పటికే గ్రూప్–4 ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం హెచ్ఎండీఏలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. రాకేష్ సోదరి కీర్తన కూడ 2023లో జిల్లా కోర్టులో ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగం సాధించింది. తండ్రి మరణించడంతో తల్లి కూలి పని చేస్తూ పిల్లలను చదివించింది. గ్రూప్–2కు ఎంపికైన రాకేష్‌ను పలువురు అభినందిస్తున్నారు.

తొలి రోజు 15 ఫిర్యాదులు

సాక్షి, సిటీబ్యూరో: నగర వ్యాప్తంగా ఉన్న గుర్తు తెలియని వాహనాలపై సమాచారం ఇవ్వాలంటూ సిటీ ట్రాఫిక్ చీఫ్ జోయల్ డెవిస్ ప్రకటించారు. దీనికి సంబంధించి తొలి రోజైన గురువారం పోలీసులకు 15 ఫిర్యాదులు అందాయి. వీటిపై స్పందించిన అధికారులు ఐదు వాహనాలు తొలగించగా.. మిగిలిన వాటిని తీసుకువెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇలాంటి వాహనాలపై 90102 03626, 87126 60600 నంబర్లకు వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వాలని జోయల్ డెవిస్ సూచించారు.

సదరం.. సులభతరం

స్లాట్ బుకింగ్ పాట్లకు ఇక చెక్

- దివ్యాంగులకు యూడీఐడీ కార్డులు
- ఇంటి నుంచే బుక్ చేసుకునే అవకాశం
- జాబితాలో కొత్తగా మరికొన్ని రుగ్మతలు
- మొత్తం 21 రకాల వైకల్యాలకు సర్టిఫికెట్లు
- తీరనున్న బాధితుల కష్టాలు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: దివ్యాంగులకు 'సదరం' కష్టాలు తీరనున్నాయి. సర్టిఫికెట్ల జారీ, రెన్యూవల్స్ ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసింది. శిబిరాల కోసం ఇప్పటి వరకు మీసేవ కేంద్రాల నుంచే దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. మారుమూల ప్రాంతాల్లోని దివ్యాంగులు అనేక వ్యయ ప్రయాసలకోర్చి సమీప పట్టణంలోని మీసేవ కేంద్రానికి చేరుకుని, స్లాట్ బుక్ చేసుకుందామని భావిస్తే.. తీరా స్లాట్లు ఖాళీ లేకుండా పోయేవి. ఇలా నెలల తరబడి మీ సేవ కేంద్రాల చుట్టూ బాధితులు తిరగాల్సి వచ్చేది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు దివ్యాంగుల జాబితాలో మరికొన్ని రుగ్మతలను చేర్చింది. ఇప్పటి వరకు ఏడు రకాల బాధితులకు మాత్రమే సదరం క్యాంపులకు అవకాశం కల్పించింది. తాజాగా మరికొన్ని రుగ్మతలను ఈ జాబితాలో చేర్చింది.

బాధితులకు ఉపశమనం

జిల్లాలో ప్రస్తుతం 27,178 మంది వివిధ రకాల వికలాంగత్వంతో బాధపడుతున్నారు. పోషకాహారలోపానికి తోడు జన్యుపరమైన కారణాలతో అనేక మంది పుట్టుకతోనే అవయవలోపంతో బాధపడుతున్నారు. వీరితో పాటు అనేక మంది రోడ్డు ప్రమాదాల్లో గాయపడి, కాళ్లు, చేతులు కోల్పోతున్నారు. మరికొంత మంది దీర్ఘకాలిక జబ్బుల బారిన పడుతున్నారు. వీరందరికీ సదరం సర్టిఫికెట్లు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గతంలో ఏడు.. ప్రస్తుతం 21 రకాలు

గతంలో ఏడు రకాల వికలత్వ రుగ్మతలకు మాత్రమే సదరం సర్టిఫికెట్లు ఇచ్చేవారు. తాజాగా మరికొన్ని జబ్బులను ఈ జాబితాలో చేర్చింది. అంధత్వంతో బాధపడే వారితో పాటు వినికిడి లోపం ఉన్నవారు, పుట్టుకతోనే అవయలోపంతో జన్మించిన వారు, రోడ్డు, ఇతర ప్రమాదాల్లో కాళ్లు, చేతులు, ఇతర అవయవాలు కోల్పోయిన వారు, ఆటిజం, యాసిడ్ దాడిలో గాయపడిన వారు, తలసీమియా బాధితులు, పక్షవాతంతో బాధపడుతున్న వారు, మానసిక రుగ్మతులు, మాటలు రాని వారు, పార్కిన్‌సన్‌తో బాధపడుతున్నవారు, కుష్టు వ్యాధిగ్రస్తులు, కండరాల సమస్యతో బాధపడుతున్న వారు, హీమోఫిలియా బాధితులు.. ఇలా మొత్తం 21 రకాల వికలాంగత్వంతో బాధ పడుతున్న వారికి అవకాశం కల్పించింది. వీరందరికి పెన్షన్ సహా ఆర్టీసీ, రైల్వే ప్రయాణాల్లో రాయితీ సౌకర్యం కల్పించనుంది.

ఇప్పటి వరకు సదరం క్యాంపులకు మీసేవ కేంద్రాల్లో మాత్రమే స్లాట్ బుక్ చేసుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం ఈ సిస్టంను సులభతరం చేసింది. వీరికీ యూనిక్ డిజబెలిటీ ఐడీకార్డు (యూడీఐడీ)ను జారీ చేయడం ద్వారా ఇంట్లో నుంచే నేరుగా స్లాట్ బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఆయా బాధితులందరికీ ఉపశమనం కలగనుంది. పాత కార్డుల రెన్యూవల్స్, కొత్తకార్డుల జారీ ప్రక్రియ పూర్తిగా ఈ యూడీఐడీ ద్వారానే నిర్వహించనుంది. అయితే స్లాట్ బుకింగ్ చేసుకునే వారికి వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి సహా గాంధీ ఆస్పత్రులను మాత్రమే ఇందుకు ఎంచుకోవాలని సూచించింది. రెండు రోజుల క్రితం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగ సంఘం ప్రతినిధులు, సంబంధిత సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేసింది.



❖ పంట కాదు.. కుంట

ఈ చిత్రంలో పచ్చగా పరుచుకున్న పచ్చదనాన్ని చూసి పంట చేను అనుకుంటే పొరబడ్డట్లే. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారంలో ఊరు ముందు కుంట ఇది. ఊరిలోని మురుగునీరంతా కుంటలోకి చేరుతోంది. ఇందులో పెరిగిన గుర్రపుడెక్క నీటిని పూర్తిగా కప్పేసింది. పచ్చగా పంటచేనును తలపిస్తోంది. – మొయినాబాద్

నవ వధువు ఆత్మహత్య

- వరకట్న వేధింపులతో మనస్తాపం
- ఉరేసుకుని బలవన్మరణం



సుజాత(ఫైల్)

కొందుర్గు: కాళ్ల పారాణి ఆరకముందే ఓ నవ వధువు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొందుర్గు మండల పరిధిలోని వెంకిర్యాలలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలం ఎన్కెపల్లికి చెందిన కప్పరి మన్యం, సుగుణమ్మల కూతురు సుజాత(21)ను , మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం లింగంపల్లికి చెందిన రాములుకు ఇచ్చి గత నెల 7న వివాహం జరిపించారు. ఈ సమయంలో వరకట్నం కింద అరతులం బంగారు అభరణాలు, స్కూటీ కొనుక్కునేందుకు రూ.70 వేల నగదుతోపాటు వంట సామగ్రి అందజేశారు. అయితే పెళ్లి జరిగిన రోజునుంచి భర్త రాములుతో పాటు మామ పోచయ్య, బావ సైదులు ఆమెను మానసికంగా బాధపెడుతున్నారు. పెళ్లికి రూ.6 లక్షలు ఖర్చు అయ్యిందని, ఈ మొత్తాన్ని మీ తల్లిదండ్రుల నుంచి తేవాలని సుజాతను ఒత్తిడి చేస్తున్నారు. ఇదిలా ఉండగా మన్యం, సుగుణమ్మ వెంకిర్యాలలోని తమ సమీప బంధువు రామకృష్ణకు చెందిన టీ స్టాల్‌లో పనిచేస్తూ ఇక్కడే ఉంటున్నారు. గురువారం వెంకిర్యాలకు వచ్చిన సుజాత రాత్రి వేళ వద్ద బాత్‌రూమ్‌లో చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి మన్యం ఫిర్యాదు మేరకు తహసీల్దార్ రమేశ్‌కుమార్ సమక్షంలో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ బాలస్వామి తెలిపారు. ఇదిలా ఉండగా సుజాత అంత్యక్రియలను అత్తగారి గ్రామమైన లింగంపల్లిలో నిర్వహించారు.

ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి

మరోసారి నోటీసులు

నేడు స్వయంగా విచారణకు హాజరు కావాలని సారాంశం

మొయినాబాద్: కోడి పందేల కేసులో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి మొయినాబాద్ పోలీసులు మరోసారి నోటీసులు ఇచ్చారు. శుక్రవారం విచారణకు హాజరు కావాలని ఇందులో పేర్కొన్నారు. తోలుకట్ట రెవెన్యూ పరిధిలోని తన వ్యవసాయ క్షేత్రంలో గత నెల 11న అర్ధరాత్రి పెద్ద ఎత్తున కోడి పందేలు నిర్వహిస్తుండగా ఎస్ఓటీ, స్థానిక పోలీసులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో రెండు రోజుల అనంతరం 13న శ్రీనివాస్‌రెడ్డికి నోటీసులు ఇచ్చారు. అప్పట్లో విచారణకు హాజరుకాని ఆయన లిఖితపూర్వకంగా వివరణ పంపించారు. ఈ క్రమంలో గురువారం ఉదయం నగరంలోని ఆయన నివాసానికి వెళ్లి మరోసారి నోటీసులు అందజేశారు. శుక్రవారం వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలని సూచించారు.

సూత్రధారులను పట్టుకుంటారా..?

ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో జరిగిన కోడి పందేల కేసు తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపింది. పందేల నిర్వాహకుడు ఏపీకి చెందిన టీడీపీ నాయకుడు శివకుమార్ వర్మతోపాటు మొత్తం 64 మందిని పోలీసులు పట్టుకున్నారు. 46 కోడి కత్తులు, 84 కోళ్లు, 55 కార్లు, 64 సెల్‌ఫోన్లు, క్యాసినో కాయిన్స్, మద్యం సీసాలతో పాటు రూ.30 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పందేల నిర్వహణ అసలు సూత్రధారులు ఇప్పటికీ పరారీలోనే ఉన్నారని, వీరిని కేసు నుంచి తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఘటనా స్థలంలో రూ.కోట్లలో నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు రూ.30 లక్షలు మాత్రమే దొరికినట్లు చూపించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. శ్రీనివాస్‌రెడ్డికి మరోసారి నోటీసులు ఇవ్వడంతో ఈకేసు మరోసారి చర్చనీయాంశమైంది.

❖ రంగుల కేళికి రెడీ



ఆమనగల్లులో రంగుల విక్రయం

హోలీ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకొనేందుకు జిల్లా వాసులు సిద్ధమయ్యారు. వివిధ రకాల రంగులు, రంగులు చల్లే గన్‌ల కొనుగోళ్లతో గురువారం మార్కెట్లలో సందడి కనిపించింది. రాత్రి కాముని దహనం నిర్వహించారు. మరోవైపు ఆయా పాఠశాలల్లో ఒకరోజు ముందుగానే సంబరాలు జరుపుకొన్నారు.



కందుకూరు: కాముని దహనం నిర్వహిస్తున్న స్థానికులు

వైన్స్‌లో చోరీ.. వ్యక్తి హత్య

- గోడకు కన్నం వేసి లోనికి చొరబడిన దుండగులు
- రూ.40 వేలు, మద్యం బాటిళ్లు, సీసీ కెమెరాల డివైజ్ చోరీ
- అడ్డుకునేందుకు వెళ్లిన వ్యక్తిపై ఆయుధంతో దాడి
- అక్కడికక్కడే మృతిచెందిన బాధితుడు
- షాబాద్‌లో ఘటన
- వివరాలు వెల్లడించిన సీఐ కాంతారెడ్డి



రోదిస్తున్న మృతుని తండ్రి బాలయ్య



భిక్షపతి ఫైల్



వైన్స్ వెనకాల దుండగులు చేసిన రంధ్రం

షాబాద్: వైన్ షాపులో చోరీకి పాల్పడిన గుర్తు తెలియని వ్యక్తులు.. అడ్డు వచ్చిన వ్యక్తిని హత్య చేశారు. ఈ సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్‌కు చెందిన చేగూరి భిక్షపతి అలియాస్ ప్రవీణ్(35) మండల కేంద్రంలోని దుర్గావైన్స్ పక్కన ఉన్న కూల్ పాయింట్(కూల్ డ్రింక్స్ షాప్)లో పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి పని ముగించుకుని వైన్ షాపు పక్కన పర్మిట్ రూమ్‌లో పడుకున్నాడు. అర్ధరాత్రి తర్వాత వైన్స్ వెనక గోడను పగులగొట్టిన దుండగులు లోనికి ప్రవేశించి, క్యాష్‌కౌంటర్‌లోని రూ.40 వేల నగదుతో పాటు మద్యం బాటిళ్లు, సీసీ కెమెరా డివైజ్‌ను తీసుకుని బయటకు వచ్చారు. వీరి అలికిడితో మెలకువ వచ్చిన ప్రవీణ్ దుండగులను అడ్డుకునే ప్రయత్నం చేయగా బలమైన ఆయుధంతో అతని తలపై మోదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చేవెళ్ల ఏసీపీ కిషన్, క్రైమ్ ఏసీపీ శంశాక్ రెడ్డి, సీసీఎస్, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్లు ప్రశాంత్, రమణారెడ్డి, డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దుండగులను పట్టుకునేందుకు ఆయా ప్రదేశాల్లోని సీసీ కెమెరా పుటేజీలు పరిశీలిస్తున్నారు. వారం రోజుల క్రితం నాగర్‌గూడ వైన్స్‌లో చోరీ ఘటనను మరవక ముందే షాబాద్ వైన్స్‌లో ఈ ఘటన జరగడం గమనార్హం. మృతుడికి వివాహం కాలేదు. తల్లి బాలమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిర్మాణం.. అయోమయం!

- నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు
- అవగాహన కోసం నమూనా
- ప్లింత్ భీంల వరకే పిల్లర్లు.. గోడలపైనే స్లాబ్
- లబ్ధిదారులు ఇష్టానుసారంగా కట్టుకోవచ్చని సూచన
- అధికారుల తీరుతో గందరగోళం



మొయినాబాద్‌లో నిర్మిస్తున్న నమూనా ఇల్లు

మొయినాబాద్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అధికారులు వింత తీరును అవలంబిస్తున్నారు. ప్లింత్ భీంల వరకే పిల్లర్లు వేసి ఆ తరువాత గోడలు నిర్మిస్తున్నారు. గోడలపైనే స్లాబ్ వేసే విధంగా ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్నారు. లబ్ధిదారులకు మాత్రం వారి ఇష్టానుసారంగా నిర్మించుకోవచ్చని చెబుతున్నారు. దీంతో ఇంటి నిర్మాణంపై స్పష్టత లేక లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. సొంతింటికోసం కలలు కంటున్న నిరుపేదలకు ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షలు ఇస్తామని ప్రకటించింది. గత జనవరి 26న ఈ పథకాన్ని ప్రారంభించింది. మొదటి విడతగా మండలానికి ఒక్క గ్రామాన్ని ఎంపికచేసి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసింది. అవగాహన కోసం మండల కేంద్రాల్లో నమూనా ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నమూనా ఇంటి నిర్మాణం చేపట్టారు.

గోడలకు సిమెంట్ బ్రిక్స్

మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 60 గజాల స్థలంలో ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మిస్తున్నారు. ఇందుకోసం మొదటగా గుంతలు తీసి పిల్లర్లు వేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా పిల్లర్లను బేస్మెంట్ లెవల్ వరకే నిర్మించారు. వాటిపై ప్లింత్ భీంలు వేశారు. అక్కడి నుంచి స్లాబ్ లెవల్‌కు ప్లిలర్లు వేయలేదు. ప్లింత్ భీంలపై గోడల నిర్మాణం చేపట్టి.. వాటిపైనే స్లాబ్ వేసేలా నిర్మిస్తున్నారు. గోడలకు సైతం సిమెంట్ బ్రిక్స్ వినియోగిస్తున్నారు. బెడ్‌రూం, కిచెన్, హాలు, బాత్‌రూం ఉండేలా ఇంటిని నిర్మిస్తున్నారు. పైకి ఎక్కడానికి మెట్లు ఉండవు. ఈ నిర్మాణాన్ని ఇటీవల వెంకటాపూర్‌కు చెందిన కొందరు లబ్ధిదారులు పరిశీలించారు. స్లాబ్ లెవల్ వరకు పిల్లర్లు లేకుండా సిమెంట్ బ్రిక్స్‌తో నిర్మించే గోడలపై స్లాబ్ వేస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని అయోమయానికి గురవుతున్నారు. అధికారులు మాత్రం లబ్ధిదారులకు ఇష్టం వచ్చిన విధంగా నిర్మించుకోవచ్చని చెబుతున్నారు.

నాలుగు విడతల్లో బిల్లులు

ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రభుత్వం నాలుగు విడతల్లో బిల్లులు చెల్లించనుంది. మొదట బేస్మెంట్ లెవల్ నిర్మాణం పూర్తయిన తరువాత రూ.లక్ష, లెంటల్ లెవల్ నిర్మాణం పూర్తయి తరువాత రూ.2 లక్షలు, స్లాబ్ వేసిన తరువాత రూ.లక్ష, ఇంటి నిర్మాణం పూర్తయిన తరువాత రూ.లక్ష లబ్ధిదారుల ఖాతాలో జమ చేయనుంది.

“ రూ.5 లక్షల్లో పూర్తి కాదు

ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. మాకు నచ్చినట్టు కట్టుకుంటే రూ.5 లక్షలు సరిపోవు. అధికారులు చెప్పినట్లు నిర్మించుకుంటే గదులు చిన్నవిగా వస్తాయి. కాస్త విశాలంగా నిర్మించుకోవాలంటే సొంత డబ్బులు పెట్టుకోవాల్సి ఉంటుంది.

– ఎల్లుల రేణుక, లబ్ధిదారు, వెంకటాపూర్

గోడలపై స్లాబ్ వేసినా దృఢమే..

ఇందిరమ్మ ఇంటిని 400 చదరపు అడుగులు, అంతకంటే ఎక్కువ స్థలంలో నిర్మించుకోవచ్చు. బేస్మెంట్ లెవల్ వరకు పిల్లర్లు వేస్తే భవిష్యత్తులో కుంగకుండా ఉంటుంది. గోడలపై స్లాబ్ వేసినా దృఢంగానే ఉంటుంది. లబ్ధిదారులు వారికి నచ్చినట్లుగా నిర్మించుకోవచ్చు.

– అబ్దుల్ హకీం, హౌసింగ్ ఏఈ, మొయినాబాద్

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ దుర్మరణం

ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న మరో వ్యక్తి

- ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న క్షతగాత్రుడు
- ఈ నెల 31న ఉద్యోగ విరమణ.. అంతలోనే ప్రమాదం

శంకర్‌పల్లి: ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన సంఘటనలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలైన మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం ఆయన పరిస్థితి కూడా విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. మోకిల ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మోకిలలో నివాసముంటున్న రవీందర్(60), ఉమాదేవి(56) దంపతులు గత బుధవారం రాత్రి 8గంటల సమయంలో స్కూటీపై నార్సింగికి వెళ్లి వస్తున్నారు. ప్రొద్దటూరు గేటు సమీపంలోని సుభిషి టౌన్‌షిప్‌లో టీ తాగేందుకు వాహనాన్ని యూ టర్న్ చేస్తుండగా.. మొహదీపట్నం నుంచి శంకర్‌పల్లి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అతివేగంగా వీరిని ఢీకొట్టింది. దీంతో ఇరువురూ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు హుటాహుటిన శంకర్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఉమాదేవిని సంగారెడ్డికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. రవీందర్ ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో గచ్చిబౌలి సన్‌షైన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉమాదేవి మృతదేహానికి చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. రవీందర్ దంపతుల కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

తీరని విషాదం

ప్రమాదంలో గాయపడిన రవీందర్ ఎక్సైజ్ శాఖలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిసింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే కొడుకుతో కలిసి ఉమాదేవి మోకిలలో ఉంటున్నారు. ఇదిలా ఉండగా రవీందర్ ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఇంతలోనే ఇలా జరగడం బాధిత కుటుంబంలో తీరని విషాదం నింపింది.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ

ఆర్టీసీ డ్రైవర్ మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


సుధాకర్(ఫైల్)

షాబాద్: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన షాబాద్ ఠాణా పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని బోడంపహాడ్ గ్రామానికి చెందిన మొగిలిగిద్ద సుధాకర్, కొత్తపల్లి బాలయ్య బైక్‌పై ఇంటికి వెళ్తున్నారు. అదే గ్రామానికి చెందిన తిమ్మక్క రజినీకాంత్ తన ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో అంతారం స్టేజీ వద్ద ఈ రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సుధాకర్, రజనీకాంత్ తీవ్రంగా గాయపడడంతో షాద్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిగి డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న సుధాకర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా బాలయ్య స్వల్పగాయాలతో బయటపడ్డాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

బైక్‌ను ఢీకొట్టిన ఆటో

ద్విచక్ర వాహనదారుడి మృతి


బక్క రాజు(ఫైల్)

మొయినాబాద్: బైక్ ను ఆటో ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన మొయినాబాద్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. చిలుకూరు గ్రామానికి చెందిన బక్క రాజు(35) బాలాజీ ఆలయం వద్ద టెంకాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 9గంటల ప్రాంతంలో రాజు తన బైక్‌పై హిమాయత్‌నగర్ వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా చిలుకూరు మహిళ ప్రాంగణ సమీపంలో ఎదురుగా వస్తున్న అశోక్ లేలాండ్ ఆటో అతివేగంగా బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజుకు తీవ్రగాయాలవడంతో గమనించిన స్థానికులు స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు సంతానం. కేసు దర్యాప్తులో ఉంది.

టీచర్స్‌కు ఏఐపై శిక్షణ

శంషాబాద్ రూరల్: ఉపాధ్యాయులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈఓ వి.కిషన్‌నాయక్ అన్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో గురువారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ప్రయోగాత్మకంగా పైలట్ ప్రాజెక్టుగా వెబ్ టూల్‌లో విద్యార్థులకు స్వీయంగా అభ్యసించే అవకాశాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని ఎంఈఓ అన్నారు.

కేసుల పేరు చెప్పి కాసులు స్వాహా

- దూషణ నుంచి మనుషుల అక్రమ రవాణా వరకు వినియోగం
- రీఫండ్ చేస్తామని బాధితురాలి నుంచి రూ.23 లక్షలు స్వాహా
- ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్, సీజేఐ పేర్లతో నకిలీ లేఖలు
- సీసీఎస్‌లో కేసు నమోదు



సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్‌కు చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగిని (65) టార్గెట్ చేసిన సైబర్ నేరగాళ్లు కేసుల పేరు చెప్పి కాసులు దండుకున్నారు. దుర్భాషలాడిన ఆరోపణలపై కేసు నమోదయ్యిందంటూ మొదలెట్టిన కేటుగాళ్లు మనీలాండరింగ్, మనుషుల అక్రమ రవాణా వరకు తీసుకెళ్లారు. మధ్యలో రిజర్వ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్, చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా పేర్లతో నకిలీ లేఖలు సృష్టించి పంపారు. రిఫండ్ చేస్తామంటూ ఆమె నుంచి రూ.23 లక్షలు కాజేశారు. నాలుగు వాయిదాల్లో ఈ మొత్తం చెల్లించిన బాధితురాలు ఎట్టకేలకు తాను మోసోయినట్లు గుర్తించి గురువారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..బాధితురాలికి ఇటీవల టెలికాం డిపార్ట్‌మెంట్ అధికారి పేరుతో ఫోన్ వచ్చింది. ఆమె ఆధార్‌కార్డు వినియోగించి సిమ్ కార్డు ద్వారా అనేక మందిని అసభ్య పదజాలంతో దూషిస్తూ కాల్స్ చేశారని ఈ మేరకు కేసు నమోదైందని చెప్పారు. కాల్‌ను బెంగళూరుకు చెందిన ఎస్సై అంటూ మరో వ్యక్తికి బదిలీ చేశాడు. కొన్ని ప్రత్యేక విభాగాలను మినహాయిస్తే దేశంలో ఏ పోలీస్ స్టేషన్‌లో అయినా ఎఫ్ఐఆర్‌ను దాని సీరియల్ నెంబర్/ఏ ఏడాది విధానంలో నమోదు చేస్తారు. అయితే బాధితురాలికి మాత్రం బీకే354ఏ/0125 నెంబర్‌తో ఎఫ్ఐఆర్ నమోదైందంటూ చెప్పిన నకిలీ ఎస్సై తక్షణం తమ వద్ద హాజరుకావాలని చెప్పాడు. దీంతో షాక్‌కు గురైన ఆమె తాను ఎలాంటి నేరాల్లోనూ పాలు పంచుకోలేదని, వయస్సు రీత్యా బెంగళూరు వరకు ప్రయాణం చేయలేనని వేడుకున్నారు. దీంతో సదరు సైబర్ నేరగాడు ఈ కేసు సైబర్ క్రైమ్ విభాగానికి బదిలీ అయ్యిందని, అక్కడ నుంచి ఓ ఉన్నతాధికారి సంప్రదిస్తారని చెప్పాడు. ఆపై బాధితురాలికి కాల్ చేసిన వ్యక్తి తాను ఐపీఎస్ అధికారినంటూ మాట్లాడాడు. తాము ఢిల్లీలో సదాసత్ ఖాన్ అనే నేరగాడిని పట్టుకున్నామని, అతడి విచారణలోనే బాధితురాలి పేరుతో ఉన్న ఆధార్ కార్డు, దానికి లింకై ఉన్న బ్యాంకు ఖాతా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపాడు. ముంబైలో తెరిచిన ఆ బ్యాంకు ఖాతాను మనీ లాండరింగ్ కోసం వాడినట్లు చెప్పి భయపెట్టాడు. అదే ఖాతాను మనుషుల అక్రమ రవాణా ముఠాలు వినియోగించాయని చెప్పాడు. ఇన్ని కేసులు నమోదైన నేపథ్యంలో బాధితురాలి పేరును వాటి నుంచి తొలగించడానికి కొంత మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశాడు. ఆ చెల్లింపు అనివార్యం అంటూ రిజర్వ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్ పేరుతో రూపొందించిన నకిలీ లేఖ పంపాడు. తన ఖాతాల్లో డిపాజిట్ చేసిన మొత్తాన్ని మూడు రోజుల్లో వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసి రిఫండ్ చేస్తామని నమ్మబలికాడు. దీంతో ఆమె కొంత మొత్తం బదిలీ చేశారు. ఆపై తన డబ్బు రిఫండ్ చేయమంటూ పదేపదే ఫోన్లు చేశారు. ఈసారి సైబర్ నేరగాళ్లు చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా పేరుతో సృష్టించిన మరో లేఖ పంపారు. అందులోనూ నగదు చెల్లించాలని, రిఫండ్ అవుతుందని ఉంది. నిజమని నమ్మిన బాధితురాలు మరికొంత మొత్తం చెల్లించారు. ఇలా నాలుగు దఫాల్లో మొత్తం రూ.23 లక్షలు బదిలీ చేశారు. కొన్ని రోజుల రిఫండ్ విషయం ఆరా తీస్తూ బాధితురాలు ఫోన్ చేయగా... నగదు రిఫండ్ వస్తుందని, ఇది జాతీయ భద్రతకు సంబంధించిన అంశం కావడంతో కుటుంబీకులతో సహా ఎవ్వరికీ చెప్పొద్దని చెప్పాడు. ఎవరికి చెప్పినా జైలుకు వెళ్లాల్సి వస్తుందని భయపెట్టాడు. ఎట్టకేలకు తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించడంతో కేసు నమోదైంది.

ప్రభుత్వ చొరవతోనే అభివృద్ధి

ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల


మాట్లాడుతున్న మంజుల

చేవెళ్ల: మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల అన్నారు. గురువారం ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో మున్సిపల్ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జనభాలో సగభాగం ఉన్న మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను సైతం అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వాలు మహిళల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా 20శాతం మహిళలు పౌష్టికాహార లోపం వల్ల రక్తహీనతతో బాధపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య నాయకురాలు వెంకటమ్మ, నాయకురాళ్లు లలిత, విజయమ్మ, రమాదేవి, వినోద, సుగుణమ్మ, అంజమ్మ, జయమ్మ, యాదమ్మ, రాములమ్మ, చంద్రకళ, సీపీఐ నాయకులు కె. రామస్వామి, వడ్ల సత్యనారాయణ, బాబురావు, యాదగిరి, శ్రీకాంత్, పెంటయ్య, తదితరులు ఉన్నారు.

భవనం పైనుంచి పడి వృద్ధుడి మృతి

మొయినాబాద్: మొదటి అంతస్తు పైనుంచి ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయాలైన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ పీఎస్ పరిధిలోని కనకమామిడిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దింటి గోవింద్‌రెడ్డి(75) కుటుంబం మొదటి అంతస్తులో నివాసముంటున్నారు. బుధవారం రాత్రి బయట ఏదో గొడవ జరుగుతుందని చూడటానికి ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. మొదటి అంతస్తుకు రేలింగ్ లేకపోవడంతో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డిన ఆయన్ను కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వృద్ధుడు గురువారం సాయంత్రం మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

షాప్ ఎదుట కుర్చీలు వేసుకోవద్దన్నందుకు..

వృద్ధుడిపై పాన్‌షాప్ నిర్వాహకుల దాడి, హత్య

సంతోష్‌నగర్: తన కిరాణా షాపు ముందు కుర్చీలు వేసుకోవద్దన్నందుకు ఓ వృద్ధుడిపై పాన్‌షాప్ నిర్వాహకులు దాడి చేసి హత్య చేసిన సంఘటన గురువారం కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శేఖర్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హఫీజ్‌బాబానగర్ సీ-బ్లాక్ ప్రాంతానికి చెందిన జాకీర్ ఖాన్ (62) స్థానికంగా కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. అతడి షాప్ పక్కనే ఫహీం, అజీమ్ అల్-అరబిక్ పాన్ షాప్ నిర్వహిస్తున్నారు. కొద్ది రోజులుగా కిరాణా దుకాణం ఎదుట కుర్చీలు వేసుకుని ఇబ్బందులకు గురి చేస్తుండటంతో జాకీర్ ఖాన్ పలుమార్లు వారిని మందలించాడు. బుధవారం రాత్రి కూడా ఫహీం, అజీమ్ జాకీర్ ఖాన్ కిరాణా దుకాణం ముందు కుర్చీలు వేసుకుని కూర్చోవడంతో తన గిరాకీ దెబ్బతింటుందని పక్కకు వేసుకోవాలని సూచించాడు. దీంతో ఆగ్రహానికి లోనైన ఫహీం, అజీమ్‌లు జాకీర్ ఖాన్‌పై దాడి చేశారు. ఈ విషయం తెలుసుకున్న జాకీర్ ఖాన్ కుమారులు జుబేర్, జీషాన్ అక్కడికి వచ్చి వారిని నిలదీయగా వారిపై సైతం దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన జాకీర్ ఖాన్‌ను చికిత్స నిమిత్తం అపోలో ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు జుబేర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వర్గీకరణ చేపట్టే వరకు పోరాటం


రిలే దీక్షలలో ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పి.కృష్ణమాదిగ

ఆమనగల్లు: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణమాదిగ అన్నారు. వర్గీకరణ చేపట్టే వరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలనే డిమాండ్‌తో చేపట్టిన దీక్షలు గురువారం నాలుగో రోజుకు చేరాయి. దీంతదీక్షలో కిశోర్‌కుమార్‌మాదిగ, సురేశ్, విజయ్‌కుమార్, సాయి, విజేందర్, మహేశ్, సచిన్, పవన్‌లు కూర్చున్నారు. ఈ సందర్భంగా పి.కృష్ణమాదిగ మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా పోరాడుతున్నా వర్గీకరణ చట్టబద్ధత కల్పించకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నారాయణ, కుమార్, శ్రీను, మహేశ్, సురేశ్, బాలరాజు, శ్రీకాంత్, కృష్ణ, శివ, నర్సింహ, కుమ్మరసంఘం నాయకులు నాగేశ్, బాలకృష్ణ, రమేశ్, తిరుపతి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌లో అత్యవసర పంపింగ్‌కు సన్నాహాలు..!

- డెడ్‌స్టోరేజీకి మరో 11 అడుగుల్లో నీటి మట్టం
- ముందస్తు ఏర్పాట్ల కోసం టెండర్ల ఆహ్వానం
- చర్యలకు ఉపక్రమించిన జలమండలి

సాక్షి,సిటీబ్యూరో: మహానగరానికి తాగునీటిని సరఫరా చేసే నాగార్జున సాగర్ జలాశయంలో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరే అవకాశాలు ఉండటంతో అత్యవసర పంపింగ్ ఏర్పాట్ల కోసం జలమండలి ముందస్తు సన్నాహాలు చేపట్టింది. వేసవి ఆరంభంలోనే సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి 11 అడుగుల దూరంలో ఉండటంతో అత్యవసర పంపింగ్ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జలమండలి అత్యవసర పంపింగ్ కోసం గురువారం టెండర్లను ఆహ్వానించింది. మొత్తం మూడు ప్యాకేజీలో రూ.5.95 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టాలని నిర్ణయించింది. 10 రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి .. ప్రాజెక్టులో నీటి మట్టం ఆధారంగా వర్క్ ఆర్డర్ ఇవ్వాలని యోచిస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా, గురువారం నాటికి 521 అడుగులకు చేరింది. అయితే జలాశయం నీటి మట్టం 510 అడుగులకు పడిపోతే అక్కంపల్లి రిజర్వాయర్‌లోకి గ్రావిటీ ద్వారా రావాల్సిన నీటిని తరలించే పరిస్థితి ఉండదు. సాగర్‌లోని ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నుంచి పుట్టంగండి పంప్ హౌస్, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారానే నీటిని సేకరిస్తున్నారు. నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి చేరుకుంటే కృష్ణాజలాల పంపింగ్ నిలిచిపోయి అత్యవసర పంపింగ్ తప్పదు.

రోజువారీగా 0.068 టీఎంసీలు డ్రా..

నగర తాగు నీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ నుంచి గ్రావిటీ ద్వారా ప్రస్తుతం రోజువారీగా 0.068 టీఎంసీల నీటిని తరలిస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 312.01 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 151.470 టీఎంసీలు అందుబాటులో ఉండగా 131.66 టీఎంసీ వరకు నీటి లభ్యత ఉంటుంది. డెడ్ స్టోరేజీ ఉన్నా..2.05 టీఎంసీలను నీటి వాడుకోవచ్చు. అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మొత్తం నీటిమట్టం 1.499 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.201 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది.

వరుసగా రెండో సారి

గతేడాది కూడా నాగార్జున సాగర్‌లో అత్యవసర పంపింగ్ ద్వారా నీటిని తరలించారు. మొదట 2017లో సాగర్ జలాశయంలో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరడంతో అత్యవసర మోటర్లు ఏర్పాటు చేసి ఆ ఏడాది సెప్టెంబర్ వరకు నీటిని పంపింగ్ చేశారు. సరిగ్గా ఎనిమిదేళ్ల తర్వాత గతేడాది నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరడంతో అత్యవసర పంపింగ్ ఏర్పాటు చేసి నీటిని తరలించారు.

సినీ దర్శకుడిపై కర్రలతో దాడి

బంజారాహిల్స్: ప్రమాదకరంగా బైక్‌లపై దూసుకెళ్తున్న యువకులను ఎందుకలా డ్రైవ్ చేస్తున్నారంటూ ప్రశ్నించిన సినీ డైరెక్టర్‌పై స్కూటరిస్టులు కర్రలతో దాడి చేసి గాయపరిచిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్‌నెంబర్-5లో నివసించే సినీ దర్శకుడు మీర్జాపురం అశోక్‌తేజ బుధవారం రాత్రి మాదాపూర్ నుంచి కృష్ణానగర్ వెళ్తుండగా జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-10 నుంచి రెండు బైక్‌లపై నలుగురు యువకులు మద్యం మత్తులో ర్యాష్ డ్రైవ్ చేస్తూ ఓవర్‌టేక్ చేస్తూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్నారు. దీనిని గుర్తించిన అశోక్ తేజ ఎందుకలా స్పీడ్‌గా వెళ్తున్నారని ప్రశ్నించాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న నలుగురు యువకులు అతడిని చుట్టుముట్టి కర్రలతో దాడి చేశారు. వారి బారినుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించినా వదిలిపెట్టలేదు. దీనిని గుర్తించిన వాహనదారులు అక్కడికి చేరుకోవడంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. సదరు యువకులు పల్సర్, ఎఫ్‌జెడ్ బైక్‌లపై రాత్రిళ్లు ఆవారాగా తిరుగుతూ, దారిన పోయేవారిని వేధిస్తూ ప్రశ్నిస్తే కొడుతూ అందినకాడికి డబ్బులు లాక్కుంటున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

భార్యను కడతేర్చిన భర్త

రహమత్‌నగర్ : కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి భార్యను హత్య చేసిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రహమత్‌నగర్ డివిజన్ రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన నరేందర్ స్థానికంగా మిల్క్ బూత్ నిర్వహిస్తున్నాడు. అతడికి భార్య పద్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. గత కొంత కాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి కూడా వారి మధ్య మరోసారి గొడవ జరగడంతో ఆగ్రహానికి లోనైన నరేందర్ పద్మ(50)ను గొంతు నులిమి హత్య చేశాడు. గురువారం ఉదయం బోరబండ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. సంఘటనా స్థలాన్ని వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్, ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ పరిశీలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

సిలిండర్‌తో మోది..

- తల్లిని దారుణంగా హత్య చేసిన తనయుడు
- ఆస్తి వివాదాలే కారణం


చంద్రకళ మృతదేహం


నిందితుడు ప్రకాష్

శంషాబాద్: ఆస్తి కోసం ఓ వ్యక్తి కన్న తల్లిని దారుణంగా హత్యచేసిన సంఘటన శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆర్‌జీఐఏ ఇన్‌స్పెక్టర్ బాలరాజు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. రాళ్లగూడ రాఘవేంద్ర కాలనీకి చెందిన చంద్రకళ(60)కు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు ప్రకాష్ (35) ఆవారాగా తిరిగేవాడు. గతంలో అతను రెండు పెళ్లిళ్లు చేసుకోగా ఇద్దరు భార్యలు అతడిని విడిచి వెళ్లిపోయారు. ప్రస్తుతం మూడో భార్యతో కలిసి ఉంటున్న అతడికి ఇద్దరు కుమార్తెలు. రాఘవేంద్రకాలనీలోని వంద గజాల ఇంటిలో తన వాటా తనకు ఇవ్వాలని ప్రకాష్ గత కొన్నాళ్లుగా తల్లిపై ఒత్తిడి చేస్తున్నాడు. ఆస్తి పత్రాలు తనకు ఇవ్వాలని వేధిస్తున్నా అతడి ప్రవర్తన సరిగా లేకపోవడంతో తల్లి నిరాకరిస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో పలుమార్లు తల్లితో గొడవ పడటంతో ఆర్‌జీఐఏ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

మద్యం మత్తులో ఘాతుకం

బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన ప్రకాష్ ఆస్తి పత్రాల కోసం మరోమారు తల్లితో గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో ఆగ్రహానికి లోనైన అతను పక్కనే ఉన్న కర్రతో పాటు గ్యాస్ సిలిండర్‌తో తల్లిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రకాష్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జీహెచ్ఎంసీలో ఇంజినీర్ల బదిలీ

- సీఈగా సహదేవ్ రత్నాకర్
- ఉన్నతాధికారికి తగ్గిన ఒక పోస్టు

సాక్షి,సిటీబ్యూరో: గత కొన్ని రోజులుగా వివిధ వర్గాలు, పత్రికల్లో వస్తున్న కథనాలతోనో ఏమో కానీ.. జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగంలో కొన్ని బదిలీలు చేశారు. ఐదు విభాగాల్లో ఉన్నత పోస్టుల్లో ఉన్న అధికారికి ఇప్పటికే ఒక పోస్టు తగ్గగా, తాజాగా మరో పోస్టు తగ్గింది. ఇద్దరికి గతంలో చేసిన విభాగాలనే తిరిగి అప్పగించారు. బదిలీల్లోనూ మతలబులు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీహెచ్ఎంసీ మెయింటనెన్స్ విభాగం సీఈ(ఎఫ్ఏసీ)గా ఖైరతాబాద్ జోన్ ఎస్ఈ సహదేవ్ రత్నాకర్‌ను నియమించారు. ఇప్పటి వరకు మెయింటనెన్స్ విభాగం సీఈ(ఓహెచ్‌టీపీ)గా ఉన్న ఎస్. భాస్కర్‌రెడ్డి సీఈ(ప్రాజెక్ట్స్, అడ్మినిస్ట్రేషన్)గా బదిలీ అయ్యారు. ఇప్పటికే ఈ బాధ్యతలు (ఎఫ్ఏసీ) ఆయనే నిర్వహిస్తున్నారు. ఎస్ఎన్‌డీపీ(ఎఫ్ఏసీ) సీఈగా ఉన్న ఎం. కోటేశ్వరరావుకు లేక్స్ సీఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో ఎల్బీనగర్ ఎస్ఈగా ఉన్న అశోక్‌రెడ్డిని తిరిగి అదేస్థానానికి బదిలీ చేశారు. ఈ విభాగంలోని ఓ ఉద్యోగి ఇటీవల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడటం ఇందుకు కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఎల్బీనగర్ ఎస్ఈగా ఉన్న..గతంలో క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎస్ఈగా పనిచేసిన ఎస్.ఎస్. నిత్యానందంను తిరిగి క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎస్ఈగా బదిలీ చేశారు. దాంతో పాటు హౌసింగ్ సీఈగానూ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయనతోపాటు ఒక సీఈ చేసుకున్న వినతుల్ని కూడా పరిగణనలోకి తీసుకుని బదిలీలు చేసినట్లు సమాచారం. క్వాలిటీ కంట్రోల్‌లోనే ఒక విభాగానికి ఎస్ఈగా ఉన్న జాకీర్‌హుస్సేన్‌ను క్వాలిటీ కంట్రోల్‌లోనే మరో విభాగానికి బదిలీ చేశారు. హయత్‌నగర్ ఈఈగా ఉన్న డి.ఆశాలతను అంబర్‌పేట ఈఈగా బదిలీ చేయడంతోపాటు సికింద్రాబాద్ జోన్ ఎస్ఈ(ఎఫ్ఏసీ)గా బాధ్యతలు అప్పగించారు. మరి కొందరు ఇంజినీర్లను కూడా బదిలీ చేశారు. బదిలీలు చేసే ఉన్నతాధికారే బదిలీలోనూ ఉండటం విశేషం.

పట్టుబడిన వాహనాలను వేలం వేయండి

సాక్షి, సిటీబ్యూరో: రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డివిజన్లలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వెంటనే వేలం వేయించాలని డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ ఆదేశించారు. గురువారం నాంపల్లి ఎక్సైజ్ భవన్‌లోని సమావేశ మందిరంలో రంగారెడ్డి డివిజన్ ఎక్సైజ్ అధికారుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శంషాబాద్, సరూర్‌నగర్, మేడ్చల్,, వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ల పరిధిలో మద్యం అమ్మకాలకు ఆటంకం కలిగిస్తున్న డ్రగ్స్, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికట్టాలని సూచించారు. పలు కేసుల్లో పట్టుబడిన గంజాయి, డ్రగ్స్‌ను ప్రభుత్వ ఆమోదిత కేంద్రాల్లో కాల్చివేయాలన్నారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయించాలని పేర్కొన్నారు. సమావేశంలో రంగారెడ్డి అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్, శంషాబాద్,సరూర్‌నగర్, వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు కృష్ణ ప్రియ, ఉజ్వలరెడ్డి, విజయ భాస్కర్ గౌడ్‌లతోపాటు, ఏఈఎస్‌లు పాల్గొన్నారు.